హైదరాబాద్ | నమస్తే తెలంగాణ | బుధవారం 11 జూన్ 2025 | WEDNESDAY, JUNE 11, 2025

## వేద పాఠశాలలో ప్రవేశాలు ప్రారంభం

శామీర్‌పేట, జూన్ 10: శ్రీరామ భద్ర వేద సంస్కృత పాఠశాలలో 2025-26వ విద్యా సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 12 సంవత్సరాలున్న వటువులకు మాత్రమే అడ్మిషన్ ఇవ్వనున్నట్లు.. పాఠశాలలో చేరదలుచుకున్న వారు 99855 59791 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు. ప్రవేశాలకు ఈ నెల 30 చివరి తేదీగా పేర్కొన్నారు.

## క్రీడా పాఠశాలల్లో దరఖాస్తుల ఆహ్వానం

సిటీ బ్యూరో, జూన్ 10 (నమస్తే తెలంగాణ): తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 4వ తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా క్రీడా యువజన సంక్షేమ అధికారి సుధాకర్‌రావుతో కలిసి ఆయన అడ్మిషన్లకు సంబంధించి వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్స్‌లో ప్రవేశానికి సంబంధిత వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలని.. దరఖాస్తు ప్రక్రియ జూన్ 7వ తేదీన ప్రారంభమైందని.. జూన్ 15న సాయంత్రం 5.00 గంటల వరకు ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకునేలా తల్లిదండ్రులను విద్యాశాఖ అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు ప్రోత్సహించాలని కలెక్టర్ కోరారు. హైదరాబాద్ జిల్లాలో మండల, జిల్లా స్థాయి ఎంపికకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని డీవైఎస్‌ఓ సుధాకర్‌రావు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# రూ. 21 వేలు పెడితే.. లక్షల్లో లాభాలంటూ..

- నిర్మలా సీతా రామన్ పేరుతో ఫేక్ వీడియోలు
- ప్రభుత్వ ఉద్యోగికి రూ. 3.2 లక్షల బురిడీ
- అవన్నీ ఏఐతో చేసిన ఫేక్ వీడియోలు
- జాగ్రత్తగా ఉండాలంటున్న సైబర్ క్రైమ్ పోలీసులు



సిటీబ్యూరో, జూన్ 10 (నమస్తే తెలంగాణ): వన్‌టైమ్ ఇన్వెస్ట్‌మెంట్ స్కీంలో రూ. 21 వేలు పెట్టుబడి పెడితే నెలకు లక్షల్లో లాభాలొస్తాయంటూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పినట్లు ఏఐతో ఫేక్ వీడియోలు తయారు చేసిన సైబర్‌నేరగాళ్లు మోసం చేస్తున్నారు. ఈ ఫేక్ వీడియోను ఫేస్‌బుక్‌లో చూసిన ఓ ప్రభుత్వ ఉద్యోగి రూ. 3.20 లక్షలు పోగొట్టుకున్నాడు. వివరాల్లోకి వెళితే .. రామంతాపూర్‌కు చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి ఫేస్‌బుక్‌లో మార్చి నెలలో ఒక వీడియోను చూశాడు. అందులో నిర్మలా సీతారామన్ చెప్పినట్లు రూ.21 వేల వన్‌టైమ్ ఇన్వెస్ట్‌మెంట్ పెడితే లక్షల్లో లాభాలొస్తాయంటూ వీడియో ఉంది (ఫేక్ వీడియో).. ఆ వీడియో లింక్‌ను బాధితుడు క్లిక్ చేసి అందులో దరఖాస్తు ఫారాన్ని నింపాడు.. రెండు మూడు రోజుల తరువాత తాను ఇన్వెస్ట్‌మెంట్ ఏజెంట్‌నని, మీరు పంపిన దరఖాస్తు తమకు అందిందంటూ ఒక గుర్తుతెలియని వ్యక్తి మాట్లాడాడు. మీరు ముందుగా ఫిన్‌డెక్సా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆ తరువాత తమ ఏజెంట్ మీకు సలహాలు సూచనలు ఇస్తారంటూ నమ్మించారు. కొద్ది సేపట్లోనే మరో మహిళ ఫోన్ చేసి తన పేరు స్నేహారెడ్డి అని మీరు ఈ స్కీమ్‌లో రూ. 21,675 డిపాజిట్ చేయాల్సి ఉంటుందని, మొదటి రోజు నుంచే లాభాలు వస్తాయంటూ నమ్మించింది. దీంతో బాధితుడు ఆ డబ్బును డిపాజిట్ చేయడంతో మొదటి రోజు రూ. 1,265 మీకు లాభం వచ్చిందని వాటిని విత్‌ డ్రా చేసుకోవాలంటూ సూచించారు. అయితే అప్పటికే రెండు మూడు రోజులు ఈ స్కీమ్ గూర్చి బాధితుడు ఆలోచించి ఆ యాప్‌లో పెట్టుబడి పెడితే లాభాలుస్తున్నాయనే భ్రమలోకి వెళ్లి ఏజెంట్లు చెబుతుంది నిజమని నమ్మేశాడు.

### అవన్నీ ఫేక్ వీడియోలు..

ప్రముఖులు చెప్పినట్లు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో ఫేక్ వీడియోలు తయారు చేస్తూ సైబర్‌నేరగాళ్లు అమాయకులను మోసం చేస్తున్నారని సైబర్‌క్రైమ్ పోలీసులు చెబుతున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు, గుర్తుతెలియని సంస్థలు ఆన్‌లైన్‌లో చీటింగ్ చేసేందుకు వివిధ మార్గాలను ఎంచుకుంటున్నారని, అందులో ప్రముఖులు చెప్పినట్లు వీడియోలు తయారు చేయడం కూడా ఒక తరహా స్వభావమని పోలీసులు సూచిస్తున్నారు. అలాంటి వీడియోలను చూసి మోసపోవద్దని, అవన్నీ ఫేక్ అని గుర్తించాలంటూ చెబుతున్నారు.

### రోజుకోసారి యాప్‌ను ఓపెన్ చేయాలి...

మీరు రోజు యాప్‌ను ఒక్కసారైనా ఓపెన్ చేయాల్సి ఉంటుందని, మీకు వచ్చే లాభం డాలర్ల రూపంలో అందులో ఎప్పటికప్పుడు డిపాజిట్ అవుతూ ఉంటుందని నమ్మించారు. వాళ్లు చెప్పినట్లే కొన్ని రోజులు యాప్‌ను ఓపెన్ చేస్తూ వెళ్లాడు.. ఆ యాప్‌లో తన లాభాలు స్క్రీన్‌పై పెరుగుతూ కన్పించాయి. కన్పించిన లాభాలు మాత్రం విత్ డ్రా చేసుకునే అవకాశం లేదు.. ఇలా కొన్ని రోజుల విరామం తరువాత బాధితుడికి నేరగాళ్లు ఫోన్ చేశారు.. మీరు ఎక్కువ మొత్తంలో డిపాజిట్ చేస్తే చాలా లాభాలు వస్తాయని, గ్యాప్ ట్రేడింగ్‌లో ఇన్వెస్ట్ చేయండంటూ సూచనలు చేశారు. వాళ్లు చెప్పిన మాటలు విన్న బాధితుడు రూ. 3 లక్షలు డిపాజిట్ చేశాడు. మీరు డిపాజిట్ చేసిన మొత్తానికి వారానికి ఒక రోజు బుధవారం మాత్రమే విత్ డ్రా చేసుకునే అవకాశముంటుందంటూ సూచించారు. మీరు రూపాయలలో డిపాజిట్ చేస్తే... అవి డాలర్లలోకి కన్వర్ట్ అవుతాయని, అవే యాప్‌లో స్క్రీన్‌పై కన్పిస్తాయంటూ నమ్మించారు. ఈ క్రమంలోనే వారం రోజుల తరువాత రూ. 29,505 విత్ డ్రా చేయడానికి అవకాశమిచ్చారు... మీరు విత్‌డ్రా చేసుకోండంటూ సూచించారు, యాప్‌లో నుంచి విత్‌డ్రా అయి, అవి బాధితుడి బ్యాంకు ఖాతాలో డిపాజిట్ అయినట్లు యాప్‌లో సూచించింది. తీరా బ్యాంకు ఖాతా చూస్తే అందులో డబ్బులు డిపాజిట్ కాలేదు. దీనిపై యాప్ కస్టమర్ కేర్‌కు ఫోన్ చేస్తే అలాంటేదేమి లేదు.. ఎదైనా టెక్నికల్ సమస్యలుండొచ్చు.. మీ డబ్బు ఎక్కడా పోదూ..ఇంకా పెట్టుబడి పెట్టండి.. మీకు మరో ఏజెంట్‌ను అప్పగిస్తామంటూ నమ్మించారు. అప్పటికే బాధితుడికి ఈ వ్యవహారంపై అనుమానం వచ్చి తన బ్యాంకులో ఆరా తీశాడు. బ్యాంకు అధికారులు ఇదంతా మోసమని చెప్పడంతో బాధితుడు 1930కు ఫోన్‌కు ఫిర్యాదు చేసి, అనంతరం రాచకొండ సైబర్‌క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## జీఆర్‌టీలో గోల్డెన్ ఎలెవెన్ ఫ్లెక్సీ ప్లాన్

సిటీబ్యూరో, జూన్10 (నమస్తే తెలంగాణ): జీఆర్‌టీ జ్యువెల్లర్స్ తమ విలువైన వినియోగదారుల కోసం ప్రత్యేకమైన ఆభరణాల కొనుగోలు ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. గోల్డెన్ ఎలెవెన్ ఫ్లెక్సీ ప్లాన్ పేరుతో ఆభరణాలు కొనుగోలు చేయడానికి మంత్లీ స్కీమ్ ప్రవేశపెట్టింది. దీని ద్వారా వినియోగదారులు 11 నెలల పాటు బంగారాన్ని సివింగ్ చేయగలరు. విశేషంగా 18% వరకు వేస్టేజి చార్జీలు వర్తించవు. ఈ ప్లాన్ ముఖ్యంగా బంగారం ధరల హెచ్చుతగ్గుల నేపథ్యంలో సమర్థవంతమైన మరియు బుద్ధిమంతమైన పరిష్కారంగా నిలుస్తోంది. వినియోగదారులు బరువు ఆధారితంగా లేదా విలువ ఆధారితంగా పొదుపు చేసి ఎంపికలలో ఏదైనా ఎంచుకోవచ్చు. ఇది ఆభరణాలు ఎంచుకునే సమయంలో వినియోగదారునికి మరింత లాభదాయకంగా ఉంటుంది. బంగారం, వజ్రాలు, ప్లాటినం లేదా వెండి మీకు నచ్చిన ఆభరణాలను ముందుగానే ప్లాన్ చేసుకోవడానికి ఇది ఉత్తమ మార్గం. నియమ, నిబంధనలు వర్తిస్తాయి. ఈ ప్లాన్ గురించి జీఆర్‌టీ జ్యువెలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ. జీఆర్ ఆనంద్ అనంత పద్మనాభన్ మాట్లాడుతూ..'కస్టమర్లు తమ కలల ఆభరణాలను ముందుగానే ప్రణాళిక వేసుకుని సులభంగా కొనుగోలు చేయగలిగేలా మా గోల్డెన్ ఎలెవెన్ ఫ్లెక్సీ ప్లాన్‌ను ఎంతో ఆలోచనాత్మకంగా రూపొందించాం. మీరు కేవలం రూ.1,000 నెలవారీ ముందస్తు చెల్లింపుతో ఈ స్కీమ్‌ను ప్రారంభించవచ్చు. పదకొండు నెలల పాటు సమాన చెల్లింపులు చేస్తే చాలు-తక్కువ కాలంలో గణనీయమైన ప్రయోజనాలు పొందవచ్చు. మీ నెలవారీ మొత్తాన్ని ఎంచుకునే దశ నుంచి, ప్రతీ చెల్లింపునకు గడువు తేదీలను మీకు గుర్తు చేయడం వరకు మొత్తం ప్రక్రియలో మా నిపుణులు మీకు మార్గనిర్దేశం చేస్తారు.' అని ఆనంద్ అన్నారు.

## ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

**టీజీఎస్‌పీఎఫ్ కమాండెంట్ త్రినాథ్**

సిటీబ్యూరో, జూన్ 10 (నమస్తే తెలంగాణ): ప్రతి ఒక్కరు ఆరోగ్య రక్షణ కోసం జాగ్రత్తలు పాటించాలని టీజీఎస్‌పీఎఫ్ కమాండెంట్, ఆరోగ్య భద్రత సెక్రటరీ ఎన్.త్రినాథ్ అన్నారు. మంగళవారం టీజీఎస్‌పీఎఫ్ హెడ్ క్వార్టర్స్ ఆధ్వర్యంలో బుద్ధభవన్‌లో ఆరోగ్య భద్రత సదస్సును నిర్వహించారు. ఇందులో భాగంగా సిబ్బందికి సాధారణ పరీక్షలతో పాటు కంటి, పంటి పరీక్షలు నిర్వహించారు. యశోద ఆస్పత్రి, శ్రీ నేత్రాలయ, సౌజన్య డెంటల్ ఆస్పత్రుల సహకారంతో ఈ సదస్సుకు హాజరైన వారికి పరీక్షలు నిర్వహించారు. టీజీఎస్‌పీఎఫ్ డీజీ డాక్టర్ అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు నిర్వహించిన అదనపు కమాండెంట్ జంగయ్య, అసిస్టెంట్ కమాండెంట్ బాబురావు, ఇన్‌స్పెక్టర్ సన్యాసిరావు, ఎస్ఐలు, ఏఎస్ఐలు పాల్గొన్నారు.





లక్ష్మీకాలనీలో మూసీ పరీవాహక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

## లక్ష్మీకాలనీలోని సమస్యలు పరిష్కరిస్తాం

**జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్**

సిటీబ్యూరో, జూన్ 10 (నమస్తే తెలంగాణ): అత్తాపూర్ లక్ష్మీకాలనీలోని ప్రజా సమస్యలు యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జోనల్ కమిషనర్ వెంకన్నతో కలిసి కమిషనర్ లక్ష్మీ కాలనీలో పర్యటించారు. కాలనీలో దోమల సమస్య, ప్రధాన రోడ్డు నుంచి కాలనీ వరకు రోడ్డు విస్తరణ, కాలనీ చుట్టూ ఉన్న మూసీ పరీవాహక స్థలంలో ప్రైవేట్ వ్యక్తులు భవన నిర్మాణ వ్యర్థాలు డంపు చేస్తున్నారని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రవి కుమార్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీధర్ పాల్గొన్నారు.

### ఆర్‌వీ కర్ణన్‌ను కలిసిన లైట్‌హౌస్ ఫౌండేషన్ చైర్మన్

గ్రేటర్‌లోని అన్ని జోన్లలో లైట్‌హౌస్ నైపుణ్యాభివృద్ధి కేంద్రాల విస్తరణపై చర్చించడానికి లైట్‌హౌస్ కమ్యూనిటీస్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ గణేష్ నటరాజన్, రాష్ట్ర అధిపతి ఆకుల శ్రీనివాస్ మంగళవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నిరుపేద యువతకు జీవనోపాధి అవకాశాలను పెంపొందించడానికి లైట్‌హౌస్ కమ్యూనిటీస్ ఫౌండేషన్ సహకారాన్ని బలోపేతం చేయడం, నైపుణ్య అభివృద్ధి కెరీర్, సంసిద్ధత కార్యక్రమాలపై వారు చర్చించారు.

## శ్రీనిధిలో క్లౌడ్ ఈఆర్పీ కోర్సు




సమావేశంలో పాల్గొన్న శ్రీనిధి యూనివర్సిటీ అధ్యక్షుడు అభిజిత్‌అవు తదితరులు

బేగంపేట్ జూన్ 10: దక్షిణ భారత దేశంలోనే తొలిసారిగా క్లౌడ్ ఈఆర్పీ ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ (బీటెక్) కోర్సును ప్రారంభించనున్నామని శ్రీనిధి యూనివర్సిటీ అధ్యక్షులు అభిజిత్‌అవు తెలిపారు. శాప్, సీడ్ ఇన్ఫోటెక్‌తో కలిసి ప్రారంభించిన కోర్సు వివరాలను మంగళవారం బేగంపేటలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వెల్లడించారు. క్లౌడ్ ఈఆర్పీ కోర్సులో చేరే విద్యార్థులకు సీఎస్ఈ డిగ్రీతో పాటు శాప్‌కు సంబంధించిన నాలుగు సర్టిఫికేషన్లు లభిస్తాయన్నారు. నాలుగు సంవత్సరాల కోర్సు అనంతరం ప్రతి ఒక్కరికీ ఉద్యోగ అవకాశాలుంటాయన్నారు. అన్నివర్గాల విద్యార్థులకు కోర్సులను అందుబాటులోకి తీసుకురావడం కోసం ఉపకార వేతనాలతో కూడిన అవకాశాలను అందుబాటులోకి తెచ్చామన్నారు. శ్రీనిధి యూనివర్సిటీ ద్వారా ప్రస్తుత సంవత్సరం కేవలం 60 సీట్లతో ప్రారంభిస్తున్నామని, వచ్చే విద్యా సంవత్సరం 120, ఆపై సంవత్సరం 180 సీట్లతో క్లౌడ్ ఈఆర్పీ కోర్సును కొనసాగిస్తామని చెప్పారు. అంతర్జాతీయ విద్యా ప్రమాణాలకు అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాన్ని విద్యార్థులకు అందించే లక్ష్యంతో కోర్సును డిజైన్ చేశామన్నారు. సమావేశంలో డా.గణేష్ నటరాజన్, రిచర్డ్ కింగ్, ఫిలిప్ సామ్యూయేల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ల హామీలను అమలు చేయాలి

**బీఎంఎస్ ఆటో ట్యాక్సీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నందకిషోర్**



రెవెన్యూ అధికారికి వినతిపత్రం ఇస్తున్న ఆటో డ్రైవర్లు

శంషాబాద్ రూరల్, జూన్ 10: రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీఎంఎస్ ఆటో ట్యాక్సీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చింతల నందకిశోర్ డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా రెవెన్యూ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రూ.12వేలు ఇస్తానని హామీ ఇచ్చి నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం ఈ హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు సయ్యద్, ఆర్‌వీఎల్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, పవన్‌కుమార్, మల్లేశ్, రాఘవేందర్, జగదీశ్‌చారి, మహేశ్, శివ, గౌస్‌పాషా పాల్గొన్నారు.

## 13 నుంచి స్టైల్ తత్వ లైఫ్‌స్టైల్ ప్రదర్శన

**ఎఫ్ఎల్‌వో హైదరాబాద్ అధ్యక్షురాలు ప్రతిభా కుందా**



స్టైల్ తత్వ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

అమీర్‌పేట్, జూన్ 10: ఎఫ్ఐసీసీఐ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎల్ఓ) హైదరాబాద్ చాప్టర్ నిర్వహించే సిగ్నేచర్ ఫ్యాషన్, లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్, 'స్టైల్ తత్వ' 5వ ఎడిషన్ జూన్ 13, 14 తేదీల్లో హైటెక్స్‌లోని హాల్-2లో జరగనుంది. ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం బేగంపేట్‌లోని హోటల్ ఐటీసీ కాకతీయలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎఫ్ఎల్‌వో హైదరాబాద్ అధ్యక్షురాలు ప్రతిభా కుందా వివరించారు. ఈ రెండు రోజుల ఎగ్జిబిషన్‌లో దేశవ్యాప్తంగా 205 ప్రదర్శకులు పాల్గొంటున్నారన్నారు. ఫ్యాషన్, డెకర్, హ్యాండ్‌లూమ్, ఆభరణాలు, హోమ్ లివింగ్, కళాత్మక ఉత్పత్తులు లాంటి విభాగాల్లో విస్తృత శ్రేణి ఉత్పత్తులు ప్రదర్శించనున్నారు. 10 వేల మందికి పైగా సందర్శకులు ఈ ఎగ్జిబిషన్‌ను తిలకించేందుకు వస్తారని ఆశిస్తున్నట్టు తెలిపారు. నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తారని, గౌరవ అతిథిగా ఎఫ్ఎల్ఓ జాతీయ అధ్యక్షురాలు శ్రీమతి పూనమ్ శర్మ, ప్రముఖ సెలబ్రిటీ డ్రేపింగ్ ఆర్టిస్ట్ డాలీ జైన్ ప్రత్యేక అతిథులుగా హాజరుకానున్నారని తెలిపారు. ఈ మీడియా సమావేశంలో గౌరవ అతిథిగా పాల్గొన్న మిస్ ఇండియా 2023, మిస్ వరల్డ్ టాప్-20 ఫైనలిస్ట్ నందిని గుప్తా మాట్లాడుతూ.. "ఇంటర్నేషనల్ బ్యూటీ కాంటెస్ట్‌లా, ఇది కూడా బ్రెయిన్‌తో కూడిన బ్యూటీ ప్రదర్శన. మహిళలు నిర్వహించే ఉద్దేశంతో కూడిన ఈ ప్రదర్శన చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతుంది" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్టైల్ తత్వ మెంటార్లు, ఎఫ్ఎల్వో మాజీ చైర్‌పర్సన్‌లు సీఏ సుభద్ర మహేశ్వరి, రీతు షా, స్టైల్ తత్వ ఎగ్జిబిషన్ కన్వీనర్ సీతారెడ్డి, కోకన్వీనర్లు రీతు అగర్వాల్, పూజా జైన్ తదితరులు పాల్గొన్నారు.

## మన భాష, యాసను కాపాడింది కేసీఆరే

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత**



కవిత ఆధ్వర్యంలో జాగృతిలో చేరుతున్న నాయకులు

హైదరాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ): 'తెలంగాణలో త్వరలోనే బోనాలు పండుగ వస్తుంది.. బోనాలు ఎత్తే సమయంలో తెలంగాణ అస్తిత్వాన్ని చాటే బ్యానర్లు కట్టండి.. జై తెలంగాణ అంటూ నినాదాలు చేయాలి.. తెలంగాణ గుర్తింపు, అస్తిత్వాన్ని కాపాడాల్సిన అవసరం ఇప్పుడు మరోసారి ఆసన్నమైంది' అని జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత జాగృతి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో మంగళవారం కవిత ఆధ్వర్యంలో నాంపల్లి, ముషీరాబాద్ నియోజకవర్గాలకు చెందిన యువత జాగృతిలో చేరారు. ఈ సందర్భంగా వారినుద్దేశించి ఆమె మాట్లాడారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ తెలంగాణ భాషతోపాటు యాసను కాపాడారని అన్నారు. తెలంగాణ భాష, సంస్కృతి, సంప్రదాయాలు కాపాడటంతోపాటు ప్రజా సమస్యల పరిష్కారానికీ తెలంగాణ జాగృతి ఉద్యమాలు చేస్తుందని ఈ సందర్భంగా కవిత ప్రకటించారు. పెంచిన ఆర్టీసీ బస్‌పాస్ చార్జీలను వెంటనే తగ్గించాలని ఆమె డిమాండ్ చేశారు.

## జంతువులపై హింస ఆపండి

**పేటా ఇండియా ప్రతినిధి డాక్టర్ అంజనా ఆగర్వాల్**




ఖైరతాబాద్, జూన్ 10: రాష్ట్రంలో జంతువులపై జరుగుతున్న హింసను నిలువరించాలని శాస్త్రవేత్త, పరిశోధన విధాన సలహాదారు (పేటా ఇండియా)డాక్టర్ అంజనా అగర్వాల్ కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కుక్కల బ్రీడ్ తయారు చేసేందుకు నిర్వహకులు హింసాపూరితమైన చర్యలకు పాల్పడుతున్నారని. ఫలితంగా పెద్ద సంఖ్యలో అవి మృత్యువాత పడుతున్నాయన్నారు. రాష్ట్రంలోని ఓ బయోసైన్స్ ల్యాబ్‌లో నిర్వాహకులు వికృత చర్యలకు పాల్పడుతున్నారని.. జంతువులపై స్టిరాయిడ్స్ లాంటివి వాడుతూ వాటి ప్రాణాలను హరిస్తున్నారన్నారు. దీనిపై ఇప్పటికే కమిటీ ఫర్ కంట్రోల్ అండ్ సస్ పీషియస్ ఫర్ ఎక్స్పరిమెంటేషన్ ఆన్ ఎనిమల్స్ (సీసీఎస్ఈఏ), సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనేజేషన్ (సీడీఎఎస్‌సీవో), నేషనల్ గుడ్ ల్యాబరేటరీ ప్రాక్టీస్ కంప్లియన్స్ మానిటరింగ్ అథారిటీ (ఎన్‌జీసీఎంఏ)కు ఫిర్యాదు చేశామన్నారు. తక్షణమే సదరు బయోసైన్స్ ల్యాబ్ లైసెన్స్‌ను రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

## విశ్వకర్మ యువయాత్రను విజయవంతం చేయాలి

**ఎమ్మెల్సీ మధుసూదనాచారి**



మధుసూదనాచారికి ఆహ్వాన పత్రం అందజేస్తున్న ప్రతినిధులు

కవాడిగూడ, జూన్ 10: యువతరం ముందుకు వస్తేనే ఏ సంఘమైనా బలోపేతం అవుతుందని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి పిలుపునిచ్చారు. విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ప్రతినిధులు మంగళవారం ఆయనను కలిసి ఈనెల 22న నిర్వహించే విశ్వకర్మ యువయాత్రకు రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ నాలెడ్జి సెంటర్ వ్యవస్థాపకుడు విశ్వనాథుల పుష్పగిరి మాట్లాడుతూ.. ఈనెల 22న ట్యాంక్‌బండ్‌పైనున్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం నుంచి ఉదయం 9 గంటలకు విశ్వకర్మ యువయాత్ర ప్రారంభమై శ్రీశైలం వరకు కొనసాగుతుందని చెప్పారు. విశ్వబ్రాహ్మణ ప్రముఖులు, యువత ఈ కార్యక్రమంలో వేలాదిగా పాల్గొంటారని తెలిపారు. ప్రతి జిల్లా నుంచి విశ్వకర్మ యువకులు యాత్రలో భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. ఇడుకోజు నరేష్‌చారి, పాలోజు కార్తీక్‌చారి, మల్లోజు శివాచారి, రామాచారి, చందు, సురేష్ మధుసూదనాచారిని ఆహ్వానించిన వారిలో ఉన్నారు.

## సహస్రకు రెయిన్‌బోలో వైద్యచికిత్స

**నమస్తే తెలంగాణ కథనానికి స్పందించిన మంత్రి దామోదర**

**వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని హామీ**



నమస్తే ఎఫెక్ట్

సిటీబ్యూరో, జూన్10 (నమస్తే తెలంగాణ): రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయి తీవ్ర గాయాలపాలైన చిన్నారి సహస్ర వైద్యచికిత్సకు దాతలు ముందుకురావాలని.. నమస్తే తెలంగాణ దినపత్రికలో 'సహస్రను ఆదుకోండి' శీర్షికన ప్రచురించిన కథనానికి రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పందించారు. చిన్నారికి హైదరాబాద్‌లో మెరుగైన వైద్యం అందించాలని, చికిత్సకయ్యే ఖర్చును పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని ఉన్నతాధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో సహస్రకు రెయిన్‌బో హాస్పిటల్‌లో చికిత్సనందిస్తున్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై హైదరాబాద్ డీఎంహెచ్‌ఓ వెంకటి వైద్యులను నిత్యం వాకబు చేస్తూనే ఉన్నారు. మరోవైపు సహస్ర వెన్నుపూసకు తీవ్రగాయం కావడం మూలంగా శస్త్ర చికిత్స చేయాల్సి వస్తుందని వైద్యులు తెలిపారు.



చిన్నారులకు కేక్ తినిపిస్తున్న నందమూరి బాలకృష్ణ

## నేను డాక్టర్ కావాలనేది ఎన్టీఆర్ కోరిక

**నటుడు నందమూరి బాలకృష్ణ**

**బసవతారకం ఆస్పత్రిలో క్యాన్సర్ రోగులతో కలిసి జన్మదిన వేడుకలు**

బంజారాహిల్స్, జూన్ 10: నగరంలోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి చైర్మన్, నటుడు నందమూరి బాలకృష్ణ 65వ జన్మదినోత్సవ వేడుకలను మంగళవారం క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులతో కలిసి జరుపుకున్నారు. వారితో కలిసి కేక్ కట్ చేయడంతో పాటు వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. తాను చదువుకునే రోజుల్లో డాక్టర్ కావాలని తన తండ్రి ఎన్టీఆర్ కోరుకున్నా సాధ్యం కాలేదని, అయితే బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి బాధ్యతలు చేపట్టడం ద్వారా తండ్రి కోరికతో పాటు తల్లి ఆశయాన్ని నెరవేర్చే అవకాశం లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ట్రస్ట్ బోర్డు సభ్యుడు జేఎస్‌ఆర్ ప్రసాద్, సీఈవో డా.కృష్ణయ్య, మెడికల్ సూపరింటెండెంట్ డా.ఫణి కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## గాలి వీచినా.. వాన కురిసినా కరెంట్ కట్

(మొదటిపేజీ తరువాయి)

ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియక వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### తెగుతున్న విద్యుత్ తీగలు..

హైదరాబాద్ సెంట్రల్, సౌత్ సర్కిళ్లతో పాటు మేడ్చల్ పరిధిలోని హబ్సిగూడ, మేడ్చల్ సర్కిల్, రంగారెడ్డి పరిధిలోని సైబర్ సిటీ, రాజేంద్రనగర్ , సరూర్‌నగర్ జోన్ల పరిధిలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఇప్పటికీ ఓవర్‌హెడ్‌లైన్లు ఈదురుగాలులతో కూడిన వర్షానికి తరచూ తెగిపడుతున్నాయి. సాయంత్రం వేళ విద్యుత్ సరఫరా నిలిచిపోతే గంటల తరబడి మళ్లీ పునరుద్ధరణ జరగడం లేదు. ప్రతి పనికి విద్యుత్‌తో ఊడిపడిన ప్రస్తుత పరిస్థితుల్లో అధికారులు విద్యుత్ సరఫరా నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఏళ్ల కిందట వేసిన విద్యుత్ లైన్లు ఈదురు గాలులకు కిందపడిపోతున్నాయి. కొన్నిసార్లు తీగలు తెగుతున్నాయి. ఇన్సులేటర్లు పేలి సరఫరా నిలిచిపోతుంది. పలు ప్రాంతాల్లో విద్యుత్ తీగలు చెట్ల కొమ్మల మధ్య ఉండడంతో గాలి వాన వచ్చినప్పుడు సమస్య ఏర్పడుతుంది. ఫీడర్లు ట్రిప్ అయి కరెంట్ సరఫరాకు అంతరాయమేర్పడుతుంది.

### ట్రిప్‌లకు కారణం చెట్ల కొమ్మలే..

ఎస్పీడీసీఎల్ సిబ్బంది తమ పరిధిలోని ఫీడర్లలో విద్యుత్ సరఫరా పరిస్థితిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉంచుకునేలా చర్యలు తీసుకుంటున్నాం. అత్యధికంగా అంతరాయం నమోదైన ఫీడర్లపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పాం. ఫీడర్ల అంతరాయాలకు చెట్లకొమ్మలు విద్యుత్ తీగలపై పడడం మూలంగానే ట్రిప్ అవుతున్నట్లు గుర్తించాం. చెట్లు అధికంగా ఉండే ప్రాంతాల్లో విధిగా పెట్రోలింగ్ చేసి తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించాం. వర్షాలు కురిసే సమయంలో సిబ్బంది ఎప్పుడూ తమ కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని, వినియోగదారుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి సమస్య పరిష్కరించాలని చెప్పాం.

– ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

## వేతనాలు అందక వెతలు

(మొదటిపేజీ తరువాయి)

సైతం వాకబు చేసేవారు. జీతభత్యాల గురించి తెలుసుకునేవారు. ఒకవేళ సకాలంలో వేతనాలు రాలేదంటే కారణాలు తెలుసుకొని అప్పటికప్పుడు పరిష్కరించేవారు. ప్రస్తుతమున్న ఆరోగ్యశాఖ మంత్రి వీటన్నటికి దూరంగా ఉంటున్నట్లు సమాచారం. ఇటీవల రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబసంక్షేమ శాఖ కార్యాలయంలో సమీక్ష నిర్వహించిన సందర్భంగా పెండింగ్ వేతనాల గురించి వైద్యసిబ్బంది అడగగా, సమీక్షకు హాజరైన వైద్యారోగ్యశాఖమంత్రి దామోదర రాజనర్సింహ ఇన్ని నెలలనుంచి మీకు సిబ్బంది వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలియదని సమాధానం దాటవేశారు. సిబ్బంది వేతనాలపై అధికారులకు ఎలాంటి ఆదేశాలు జారీ చేయకపోవడంతో బస్తీ దవాఖానల్లో పని చేసే సిబ్బంది నిరాశకు గురయ్యారు. హైదరాబాద్ లాంటి ప్రాంతాల్లో ప్రతినెలా ఇంటి అద్దెలు, ఈఎంఐలు, నిత్యావసర సరుకులు కొనాలంటే వైద్య సిబ్బంది అప్పులు చేస్తున్నారు.